క్లుప్తంగా

ప్రతి కూలీకి ఉపాధి కల్పించడమే లక్ష్యం

- ఎంపీపీ బాక ఈశ్వరి



ఉపాధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ ఈశ్వరి, సర్పంచ్ సోయిత

డుంబ్రిగుడ: జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ బాక ఈశ్వరి అన్నారు. సొవ్వ పంచాయతీలో శుక్రవారం చేపట్టిన ఉపాధి పనులను ఎంపీపీ బాక ఈశ్వరి,సర్పంచ్ సోయిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈశ్వరి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి కూలీల వలసలు తగ్గాయని చెప్పారు. ఏపీవో దొరబాబు, వీఆర్పీలు రెల్లి,లక్ష్మి,టీఏ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ ఆనందరావు

డుంబ్రిగుడ: రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను శుక్రవారం కంద్రుం యూపీ పాఠశాల విద్యార్థులకు వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల నిర్మాణాలకు భూమిపూజ



పినకిల్తారిలో దేవాలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న అప్పలరాజు

జి.మాడుగుల: తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో దేవదాయ ధర్మాదాయశాఖ సహకారంతో మండలంలో వంజరి పంచాయతీ పినకిల్తారిలో కనకదుర్గమ్మ ఆలయం, గొప్పుల పాలెంలో రామాలయం నిర్మాణానికి విశ్వహిందూపరిషత్ జిల్లా ధర్మప్రచార ప్రముఖ్ రీమెలి అప్పలరాజు, గ్రామస్తులు శుక్రవారం భూమిపూజ చేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ వంజరి సన్యాసినాయుడు, గ్రామ పెద్దలు వంతాల కృష్ణ,పోతురాజు, రామలింగం, రాజంనాయుడు, భీమన్న, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

అరకులోయ రూరల్: మన్యంలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరుతూ స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద శుక్రవారం బీజేపీ నాయకులు ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శాంతకుమారి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మైనింగ్ అనుమతులను తక్షణం రద్దు చేయాలన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజారావు, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర, అరకు అసెంబ్లీ అన్వీనర్ ధర్మరాజు,నాయకులు రాంచందర్,దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి బయట ఉన్న ఆటో చోరీ

మాకవరపాలెం : ఇంటి బయట పెట్టిన ఆటో చోరీకి గురైంది. మండలంలోని భీమబోయిన పాలెం గ్రామానికి చెందిన షేక్ నూర్జహాన్ ఎప్పటిలాగే గురువారం తన ఆటోను ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. ఉదయం నిద్రలేచి చూసేసరికి ఆటో కనిపించకపోవడంతో చుట్టు పక్కల గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపాడు.

గురితప్పని చదువులు

- ఏకలవ్య పాఠశాలలతో అందుబాటులో సీబీఎస్ఈ సిలబస్
- ఏటా ఆరో తరగతిలో 660 మందికి ప్రవేశం
- మన్యంలో గిరిజన విద్యాభివృద్ధికి చర్యలు



మారేడుమిల్లిలోని ఏకలవ్య పాఠశాల

రంపచోడవరం: మన్యంలో ఏకలవ్య పాఠశాలలు విద్య సుగంధాలు వెదజల్లుతున్నాయి. గిరిజన విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందిస్తున్నాయి. ఏటా ప్రవేశ పరీక్షలు నిర్వహించి నూరుశాతం గిరిజన విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నాయి. కేంద్రం ప్రభుత్వం అండదండలతో సీబీఎస్ఈ సిలబస్‌తో ఇంగ్లిషు మాధ్యమంలో బోధన సాగుతోంది. మినిస్ట్రీస్ ఆఫ్ ట్రైబల్ ఎఫైర్స్ ఆధ్వర్యంలో ఆదివాసీ బిడ్డలకు ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యను అందిస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలు కోసం ఇప్పటికే ఎంట్రన్స్ టెస్టు నిర్వహించారు. ఈ ఏడాది సీబీఎస్ఈలో టెన్త్ పరీక్షలు రాసిన వై.రామవరం ఏకలవ్య పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించగా, మారేడుమిల్లి ఏకలవ్య పాఠశాల విద్యార్థులు 92 శాతం ఉత్తీర్ణత సాధించారు.

జిల్లాలో 11 ఏకలవ్య పాఠశాలలు

అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11 ఏకలవ్య పాఠశాలలు(ఈఎంఆర్ స్కూళ్లు) ఉన్నాయి. రంపచోడవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి, అడ్డతీగల, వై.రామవరం, చింతూరు, ముంచంగిపుట్టు, పెదబయలు, పాడేరు, చింతపల్లి, జీకే వీధిల్లో ఏకలవ్య పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ఏటా ఆరో తరగతిలో 660 మందికి ప్రవేశం కల్పిస్తున్నారు. వై.రామవరం, మారేడుమిల్లిల్లో ఉన్న ఏకలవ్య పాఠశాలల్లో ప్రస్తుతం ఆరు నుంచి ఇంటర్ రెండో సంవత్సరం వరకు విద్యార్థులు చదువుతున్నారు. అడ్డతీగల, రంపచోడవరం పాఠశాలల్లో ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల విద్యార్థులు చదువుతున్నారు. చింతూరు, రాజవొమ్మంగి పాఠశాలల్లో పదో తరగతి వరకు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది రంపచోడవరం డివిజన్ పరిధిలోని ఆరు పాఠశాలల్లో ఆరో తరగతిలో 360 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించనున్నారు. వీటిలో కొండరెడ్డి గిరిజనులకు సీట్లు కేటాయించారు.

రంపచోడవరం ఏకలవ్య పాఠశాలకు సంబంధించి భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అడ్డతీగల ఈఎంఆర్ పాఠశాల భవనం పనులు 30శాతం పైనే పనులు పూర్తి చేశారు.

జూన్ నుంచి కొత్త మెనూ

ఇప్పటి వరకు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మెనూ అమలు చేశాం. జూన్ నుంచి కొత్త మెనూ అమలు చేస్తాం. ఇక్కడ చదివే విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నాం. ఉత్తమమైన విద్యను అందించడమే ఈఎంఆర్ పాఠశాలల లక్ష్యం.

– ఎం.వి. రమణ, ప్రిన్సిపాల్, రంపచోడవరం, ఈఎంఆర్

అసైన్‌మెంట్ భూముల సర్వే ప్రారంభం



అసైన్‌మెంట్ భూములను సర్వే చేస్తున్న సిబ్బంది

కూనవరం: చూచిరేవులగూడెం పంచాయతీ పరిధిలో 30 ఏళ్ల నుంచి గిరిజనులు సాగుచేస్తున్న అసైన్‌మెంట్ భూములకు పట్టాలు ఇచ్చేందుకు ఎట్టకేలకు సర్వే ప్రారంభమైంది. రంపచోడవరం ఎమ్మెల్యే నాగుల పల్లి ధనలక్ష్మి ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ అధికారులు శుక్రవారం భూముల సర్వే ప్రక్రియను చేపట్టారు. చూచిరేవులగూడెం పంచాయతీ పైదిగూడెంలో సర్వే నంబరు 23లో జగ్గవరం పంచాయతీకి చెందిన గిరిజన రైతులు సాగుచేకుంటున్న భూములను మొదటి రోజు సర్వే చేశారు. చూచిరేవులగూడెం పంచాయతీ పరిధిలో సుమారు 863 ఎకరాల సెటిల్‌మెంట్, అసైన్‌మెంట్ భూమి ఉందని, అందులో 260 ఎకరాలు 1950లోనే సెటిల్‌మెంట్ పట్టాలు పొంది ఉన్నారని జగ్గవరం సర్పంచ్ కారం పార్వతి తెలిపారు. భూముల సర్వే వేగవంతం చేసి పట్టాలు మంజూరు చేయాలని సర్పంచ్ కారం పార్వతి, చూచిరేవులగూడెం సర్పంచ్ తెల్లం నిరోషా, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్ తదితరులు తహసీల్దారు కె.అనసూయను కోరారు.

ఘనంగా రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబు జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు

అరకులోయ రూరల్: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు జన్మదిన వేడుకలను కొత్త భల్లుగూడ పంచాయతీ గద్యగూడలోని ఆయన ఫాంహౌస్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేక్ కట్ చేశారు. వివిధ మండలాల నుంచి వచ్చిన ఉద్యోగులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవిబాబును దుశ్శాలువాలు, పూలదండలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు,ఎస్టీ కమిషన్ సభ్యుడు విశ్వేశ్వరరాజు,ఎంపీటీసీ సభ్యుడు, ఆనంద్ కుమార్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు దూరు సన్యాసిదొర,పాంగి చిన్నరావు,భాస్కర్‌రావు, అశోక్ కుమార్, కాసులమ్మ,విజయ్‌కుమార్, ప్రకాష్, అప్పలరాజు, గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు అశ్వత్థామ,త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సులకు సత్కారం



హుకుంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో నర్సులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: వైద్యపరంగా నర్సులు చేస్తున్న సేవలు ఎనలేనివని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన పర్యటించారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని ఎమ్మెల్యే సందర్శించి నర్సులకు పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నర్సులు మరిన్ని సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వాణిజ్యవిభాగం జిల్లా అధ్యక్షుడు ఒంటుబు సామ్యేల్,జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సివేరి కొండలరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.రామకృష్ణా,ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కొర్ర నాగరాజు,నాయకులు కోటిబాబు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

జీసీసీలో అవకతవకలపై విచారణ జరపాలి

చింతూరు: స్థానిక జీసీసీ కార్యాలయం కేంద్రంగా జరుగుతున్న అవకతవకలపై విచారణ జరపాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాయం వెంకయ్య, మండల అధ్యక్షుడు రమణారెడ్డి కోరారు. శుక్రవారం వారు చింతూరులో మాట్లాడుతూ జీసీసీ గోదాం నుంచి రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. ఈ వ్యవహారంలో బినామీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కీలకపాత్ర వహిస్తున్నారని, వారిని వెంటనే తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొజ్జమ్మ, ముత్తయ్య, వీర్రాజు పాల్గొన్నారు.

దాబుగూడ రహదారి నిర్మాణం పూర్తి చేయాలని వినతి

అరకులోయ రూరల్: మండలంలో మాదల పంచాయతీ దాబుగూడ రహదారి నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ గిరిజన సంఘం మండల కార్యదర్శి రామన్న, కార్యదర్శిరమేష్‌లు శుక్రవారం జూనియర్ అసిస్టెంట్ కాంతమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 సంవత్సరంలో రహదారి పనులు ప్రారంభించి వదిలేశారన్నారు.రహదారి సౌకర్యం లేక ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించగా వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రసాద్, సీతరాం, రాము తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగుకు దూరంగా ఉండాలి



కిముడుపల్లిలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్, ఎస్‌ఐ

పెదబయలు: గంజాయి సాగుకు దూరంగా ఉండి, ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలని తహసీల్దార్ సుధాకర్, ఎస్‌ఐ మనోజ్‌కుమార్ అన్నారు. మండలంలోని కిముడుపల్లి పంచాయతీలోని గిరిజనులకు గంజాయి సాగు నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుధాకర్, ఎస్‌ఐ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటలతో గిరిజనులకు భరోసా కల్పిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గంజాయి సాగుతో యువకులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరిలోనూమార్పురావాలనివారు ఆకాంక్షించారు.

ఎన్‌హెచ్ పనులతో సాగునీటి ప్రవాహానికి అడ్డంకులు



తంటికొండ గ్రామం వద్ద పంటకాలువ

రాజవొమ్మంగి: ఎన్‌హెచ్516 పనులతో మండలంలోని తంటికొండ గ్రామం మీదుగా వట్టిగెడ్డ గ్రామానికి సాగునీరందించే పంటకాలువలో ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి.ఈ పంట కాలువ వెళ్లే మార్గంలో రహదారి నిర్మాణం ఎత్తుగా చేపట్టారు. అదే విధంగా కాలువ ప్రవహించే తూము మట్టితో నిండిపోవడం వల్ల నీటి ప్రవాహం నిలిచిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీరు దిగువకు వెళ్లే మార్గం లేకపోవడంతో తంటికొండ గ్రామం ముంపునకు గురైన సంగతి తెలిసిందే. మరోవైపు ఖరీఫ్ సీజన్ ప్రారంభంకానున్న నేపథ్యంలో పంటకాలువకు అడ్డు తొలగించి దిగువ పొలాలకు నీరందించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎన్‌హెచ్515 ఏఈ చక్రవర్తిని వివరణ కోరగా ఖరీఫ్ సీజన్ మొదలయ్యే సమయానికి నీరు ప్రవహించేలా డైవర్షన్ పనులు చేపడతామన్నారు. సాగునీరు సమస్య తలెత్తనీయమని చెప్పారు.

రోడ్డు పనుల పరిశీలన



తారురోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి: మండలంలోని కొత్తూరు పంచాయతీ తుమ్మనవలస నుంచి గంగవరం వరకు నిర్మిస్తున్న తారురోడ్డు పనులను ఎంపీపీ శెట్టి నీలవేణి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ ఉపాధిహామీ పథకంలో ఈ తారురోడ్డు పనులను ప్రారంభించినట్టు చెప్పారు. రోడ్డు నిర్మాణం చేపట్టడంతో గంగవరం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

14న హనుమ విజయ యాత్ర



జి.మాడుగులలో హనుమ విజయ యాత్ర కరపత్రాలను అందజేస్తున్న భక్తులు

జి.మాడుగుల: హనుమజ్జయంతి సందర్భంగా మండలంలోని గాంధీనగర్ హనుమ ఆశ్రమం ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు జి.మాడుగుల వీధుల్లో హనుమ విజయ యాత్ర నిర్వహించనున్నట్టు శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి భక్త బృందం తెలిపింది. ఈ విజయయాత్రలో శ్రీహనుమ ఆశ్రమం ప్రతినిధి సాయిరాంస్వామిజీ, కృష్ణాపురం శ్రీపాకల పాటి గురుదేవుల ఆశ్రమం నుంచి శ్రీరామానంద స్వామిజీ, టీటీడీ దేవస్థానం వేద పండితులు పాల్గొంటారని వారు తెలిపారు. ఈ విజయయాత్ర పై మండలంలోని పలు గ్రామాల్లో శ్రీపంచముఖ ఆంజనేయ భక్త బృందం సభ్యులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలతో ప్రచారం చేశారు.

సెలవుల్లో ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించ వద్దు



డీఈవో సలీంబాషాకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

పాడేరు రూరల్ : వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు అదనపు బాధ్యతలు అప్పగించవద్దని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య చైర్మన్ ఆర్.జగన్మోహన్‌రావు, కో చైర్మన్ వి.వెంకటరమణ కోరారు. ఈ మేరకు శుక్రవారం పాడేరులో వారు జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషాను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. రాత పూర్వక ఆదేశాలు జారీ చేయకుండా సెలవుల్లో పని చేయమనడం సరికాదన్నారు. వినతిపత్రం అందించిన వారిలో ఫ్యాప్టో డిప్యూటీ జనరల్ సెక్రెటరి ఎస్.శేషగిరిరావు, నాయకులు జి. వరలక్ష్మి, దిలిప్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మూడు గ్రామాల్లో మూడో విడత రీ సర్వే



రీసర్వే నిబంధనలను వివరిస్తున్న తహసీల్దార్ కనకారావు

నాతవరం : మండలంలో జగనన్న భూ రీసర్వేకు మూడు గ్రామ పంచాయతీలను ఎంపిక చేసినట్టు తహసీల్దార్ పి.కనకారావు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో మండల సర్వేయర్ బాలరెడ్డి, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన భూరీసర్వే ద్వారా రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రెండు విడతల్లో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జగనన్న భూ హక్కు పత్రాలను పంపిణీ చేసినట్టు తెలిపారు. మూడో విడతలో గన్నవరం, చెర్లోపాలెం, ఎం.బెన్నవరం గ్రామాల్లో సర్వే జరపనున్నట్టు పేర్కొన్నారు. రీసర్వే ప్రయోజనాలను గ్రామస్తులకు వివరించి, వారి సహకారంతోనే సర్వే పూర్తి చేయాలని సూచించారు. రైతులు సంతృప్తి చెందేలా, అవకతవకలకు తావులేకుండా, నిబంధనల మేరకు పని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నారాయణరావు, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, సర్వేయర్లు వీఆర్వోలు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాంతో సత్వర పరిష్కారం



తహసీల్దార్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధికారులు

నాతవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి న 'జగనన్నకు చెబుదాం'కార్యక్రమం ద్వారా అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని తహసీల్దార్ పి.కనకారావు అన్నారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులపై మండల స్థాయి అధికారులతో తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. విభాగాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలపై చర్చించారు. ఇద్దరు ఫిర్యాదుదారులతో మాట్లాడి, పరిష్కారానికి సూచనలు చేశారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జి.వి.లక్ష్మి, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, ఎస్‌ఐ డి.లక్ష్మినారాయణ, ఎంఈవో తాడి అమృత్‌కుమార్, వ్యవసాయాధికారి శైలజ, విద్యుత్ శాఖ, హౌసింగ్ జేఈలు చంద్రమౌళి, జోగారావు, ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నారావు, వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొదటి విడతగా 19 వేల పాఠ్యపుస్తకాలు



అడ్డతీగల స్టాక్ పాయింట్‌లో పాఠ్యపుస్తకాలను పంపిణీని పరిశీలిస్తున్న ఎంఇవో వై.మల్లేశ్వరరావు

అడ్డతీగల: మండలానికి 2023–2024 విద్యాసంవత్సరానికి అవసరమైన పాఠ్యపుస్తకాల్లో మొదటి విడతగా 19 వేలు అందుబాటులోకి రాగా, పాఠశాలలకు పంపిస్తున్నట్టు ఎంఈవో వై.మల్లేశ్వరరావు తెలిపారు. మండలవ్యాప్తంగా వివిధ యాజమాన్యాల కింద 91 పాఠశాలలు ఉండగా 4,200 మంది విద్యార్థులు చదువుతున్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న వీరికి 46,063 పాఠ్యపుస్తకాలు అవసరం అవుతాయని ప్రతిపాదన చేశామన్నారు. మొదటి విడతగా 19,009 పాఠ్యపుస్తకాలు రెండు రోజుల క్రితం మండలస్థాయి స్టాక్ పాయింట్‌కి వచ్చాయన్నారు. ఇంకా 27,054 పాఠ్యపుస్తకాలు రావలసి ఉందన్నారు.

గంగవరానికి 12,787 పుస్తకాలు

గంగవరం: మండలంలో 2023– 24 విద్యా సంవత్సరానికి 30,340 పుస్తకాలు అవసరం కాగా, ప్రస్తుతం 12,787 పాఠ్య పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయని ఎంఈవో వై.మల్లేశ్వరరావు తెలిపారు. ఈ పుస్తకాలను పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేస్తున్నట్టు ఆయన చెప్పారు. హెచ్ఎంలు ఎంఆర్‌సీ నుంచి పాఠ్యపుస్తకాలను తీసుకోవాలని తెలిపారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ రవీంద్రనాథ్

దేవరాపల్లి : ప్రభుత్వం 50 శాతం రాయితీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చోడవరం వ్యవసాయశాఖ ఏడీఏ వి.రవీంద్రనాథ్ కోరారు. మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ అధ్యక్షతన దేవరాపల్లి వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట భూముల్లో పచ్చిరొట్ట ఎరువుల వాడకం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, పచ్చిరొట్ట ఎరువులు వినియోగిస్తే పురుగుల బెడద నుంచి పంటను రక్షించుకోవచ్చన్నారు. 10 కేజీల జీలుగు ధర రూ.970 కాగా రైతు రూ.395 చెల్లిస్తే చాలన్నారు. జనుము 10 కిలోలు రూ.840 కాగా, రూ.420, పిల్లి పెసర 8 కేజీల ధర రూ.970 కాగా రైతు రూ.485 చెల్లించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.కిరణ్‌కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు

మాకవరపాలెం : హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని లచ్చన్నపాలెంలో ఏటా హనుమాన్ జయంతిని వైభవంగా నిర్వహిస్తారు. ఆదివారం హనుమాన్ జయంతి నేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచి గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. మూడు రోజుల పాటు పూజలు, హోమాలు చేయనున్నారు. ఆదివారం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ

కె.కోటపాడు : ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. కింతాడ గ్రామంలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా గృహ లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణాలను వేగవంతం చేసి, నిర్మాణ ప్రగతి ఆధారంగా లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమచేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలను పరిశీలించి త్వరితగతిన భవన నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. కింతాడ పంచాయతీ గొల్లలపాలెం కేజీబీవీ పాఠశాలలో ఇంటర్ ఉత్తీర్ణులు కాని విద్యార్థినులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆమె పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ప్రసాద్, హౌసింగ్ ఏఈ రవిబాబు, కేజీబీవీ ప్రిన్సిపాల్ బి.చిన్నమ్మలు, ఉప సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు, పంచాయతీ కార్యదర్శి అనురాధ పాల్గొన్నారు.

మానిటరింగ్ టీం ఏర్పాటు



తహసీల్దార్ మహేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటైన పర్యవేక్షణ బృందం

రావికమతం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నకు చెబుదాం'కార్యక్రమం విజయవంతానికి మండల స్థాయిలో తహసీల్దార్ ఆధ్వర్యంలో మండల మానిటరింగ్ టీం శుక్రవారం ఏర్పాటైంది. ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఈ టీం సభ్యులు పరిశీలించి తక్షణం గ్రామ స్థాయిలో విచారించి, పరిష్కారానికి కృషి చేయనున్నారు. ఆపై నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తారు. బృందంలో తహసీల్దార్‌తోపాటు ఎంపీడీవో వెంకన్నబాబు, ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు, పలు శాఖల అధికార్లు ఉన్నారు.